క్లుప్తంగా

తాగునీటి సరఫరాపై అవగాహన



వాటర్‌మెన్‌లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కందుకూరు: మిషన్ భగీరథ పథకంలో భాగంగా తాగునీటి సరఫరా, నాణ్యత, పైప్‌లైన్లు, మోటార్లు, చేతి పంపుల మరమ్మతులపై అధికారులు సోమవారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో వాటర్ మెన్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటర్‌మెన్‌లకు చేతి పంపులు, మోటార్ల మరమ్మతులు, పైప్‌లైన్ల లీకేజీలు, మరమ్మతులు, సరఫరాలో నాణ్యత తదితర అంశాలపై నాలుగురోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా మొదటిరోజు డీఈఈ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేతి పంపులపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, ఏఈలు శారద, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డులు స్వాధీనం



రికార్డులను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో హర్షగూడ గ్రామ పంచాయతీని విలీనం చేస్తూ గత కొద్ది రోజుల కిందట ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పలు రకాల రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి ఈ గ్రామ బాధ్యతలు మున్సిపాలిటీ చూస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శైలజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్, కమిషనర్ బి.వెంకట్రామ్, మేనేజర్ పర్వతాలు, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, ఏఈ కె.భార్గవ్‌రెడ్డి, నాయకులు సుధాకర్, శివయ్య, పాండునాయక్ తదితరులు ఉన్నారు.

అధ్యయన యాత్రలో మేయర్, కార్పొరేటర్లు

ఎల్‌బీనగర్: అధ్యయన యాత్రలో భాగంగా జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు మేయర్ విజయలక్ష్మీతో కలిసి లక్నోకు వెళ్లి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేశారు.అనంతరం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. నగరంలో పౌర సౌకర్యాలు మెరుగుపర్చేందుకు ఈ అధ్యయనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ పర్యటన ట్రాఫిక్ నియంత్రణ పద్ధతులు, మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడుతుందని అన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆదిబట్ల మున్సిపాలిటీ కన్వీనర్ తులసిగారి నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులు, సిబ్బందితో కలిసి పుర కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడారు. వేతనాలు అందక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనులు చేసే కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. పనికి తగిన వేతనంతో పాటు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కిషన్, బుగ్గరాములు, ఎల్లేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

చేవెళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లు పొందేందుకు ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించిందని చేవెళ్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీ.ఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకునేవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్ పాసైన అభ్యర్థులు లేదా సమాన అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు పొందాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నెం.99086 40914లను సంప్రదించాలన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు తూకం
- పౌష్టికాహారలోపం నివారణే లక్ష్యం
- ఎదుగుదలకు పర్యవేక్షణ కార్డుల అందజేత



గంగారంలో చిన్నారి ఎత్తు కొలుస్తున్న అంగన్‌వాడీ టీచర్



పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్డు

మహేశ్వరం: చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలలో ఆటపాటలతో కూడిన విద్యాబోధనతో పాటు ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరమైన అదనపు ఆహారాన్ని సమకూరుస్తోంది. ప్రతి నెల బరువు, ఎత్తు కొలతలను లెక్కిస్తూ పౌష్టికాహార లోప నివారణే లక్ష్యంగా ముందుకుసాగుతోంది. ఫలితంగా పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారుల సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. ఒకప్పుడు ఎక్కువ మంది పిల్లలు పౌష్టికాహార లోపం, రక్తహీనతతో బాధపడేవారు. ఆ లోపం ఉన్న పిల్లల్లో ఎదుగుదల లేక ఆయాసం, నీరసం వంటి లక్షణాలతో కనిపించేవారు. దీంతో చదువులపై సైతం శ్రద్ధ చూపలేకపోయేవారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లల ఎదుగుదలను నిత్యం పర్యవేక్షించడం, ఆకుకూరలు, పప్పు, కోడి గుడ్లతో కూడిన పౌష్టికాహారం అందించడంతో పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతున్నారు.

గ్రోత్ మానిటరింగ్‌తో తగ్గిన సమస్య..

అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధి మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్ మండలాల్లో మొత్తం 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు–3296 మంది, 07 నెలలు–7 సంవత్సరాలలోపు చిన్నారులు–9268 మంది, ప్రీ స్కూలు పిల్లలు–9296 మంది పిల్లలున్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గ్రోత్ మానిటరింగ్ చేస్తున్నారు. దీని కోసం పిల్లలకు ఎత్తు, బరువు తీయడానికి పరికరాలను కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించింది. ప్రతి అంగన్‌వాడీ టీచర్ తన పరిధిలోని ఐదేళ్లలోపు పిల్లలకు ఎత్తు, బరువు తూచి వివరాలను ఐసీడీఎస్ యాప్‌లో నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలియజేయాలి. వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు లేకపోతే అదనంగా పౌష్టికాహారం పిల్లలకు అందిస్తారు. ప్రభుత్వం ప్రతి నెల సరఫరా చేసే గుడ్లు, అదనపు పౌష్టికాహారం సక్రమంగా అందేలా సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు బాల్యానికి భరోసాగా నిలుస్తున్నాయని గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులు తల్లిదండ్రులు అంటున్నారు.

పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నాం



మహేశ్వరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి అదనపు పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతి నెల తప్పనిసరిగా గ్రోత్ మానిటరింగ్ నిర్వహిస్తున్నాం. కుటుంబంలో తల్లీ, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అసెస్‌మెంట్ కార్డులు అందించి దాంట్లో బరువులు, ఎత్తులు, ఆరోగ్యం వివరాలను పొందుపరుస్తాం. ప్రాజెక్టు పరిధిలో పోషణ లోపంతో 733 మంది పిల్లలు, తీవ్ర పోషణ లోపంతో 592 మంది, అతి తీవ్ర పోషణ లోపంతో 141 మంది పిల్లలను గుర్తించాం. ముగ్గురు పిల్లలు గుండె సంబంధిత రోగాలతో బాధపడుతున్నట్లు గుర్తించాం. వారిని త్వరలో జిల్లా కలెక్టర్ అనుమతితో నిలోఫర్ చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లి గుండె ఆపరేషన్లు చేయిస్తాం. పోషణ లోపంతో బాధపడుతున్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం ప్లస్‌ను అందిస్తున్నాం. పోషణ లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతాం. – శాంతిశ్రీ, సీడీపీఓ, ఐసీడీఎస్, మహేశ్వరం

ఆరుబయట చెత్త వేయొద్దు

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్



తుక్కుగూడలో వీధులను శుభ్రం చేస్తున్న సిబ్బంది

తుక్కుగూడ: మున్సిపాలిటీ ప్రజలు చెత్త ఆరుబయట వేయకుండా సిబ్బందికి అప్పగించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ సూచించారు. సోమవారం స్వచ్ఛత హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. ఆరుబయట చెత్తవేయడం ద్వారా దోమలు, ఈగలు సంఖ్య పెరిగి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందుకు వచ్చే చెత్త వాహనాల్లోనే చెత్త వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తయ్యేలా చూడండి

ఎమ్మెల్యే సబితారెడ్డికి స్థానికుల వినతి



ఎమ్మెల్యే సబితారెడ్డికి సమస్యను వివరిస్తున్న కౌన్సిలర్ శంకర్, తదితరులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీ 19వ వార్డులో గతంలో శంకుస్థాపన చేసిన రహదారుల పనులను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక కౌన్సిలర్ పల్లపు శంకర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానికులతో కలిసి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. 19వ వార్డులో రూ.50 లక్షల వ్యయంతో ఆరు రహదారులకు గతంలో శంకుస్థాపన చేశారని, ఇందులో మూడు రోడ్లను తవ్వి కంకర పరిచారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత కాంట్రాక్టర్ మాత్రం ప్రస్తుతం ఆ పనులపై నిర్లక్ష్యం వహించడంతో కంకర పరిచిన రహదారులపై రాకపోకలు సాగించలేక స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. ఈ విషయమై స్పందించిన ఆమె వెంటనే మున్సిపల్ డీఈకి ఫోన్ చేసి వారంలో పనులు ప్రారంభించాలని ఆదేశించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆరు రోడ్లు పూర్తయితే వార్డులో 80శాతం మేర రోడ్లు అభివృద్ధి చెందినట్టేనని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు బాబు, మారుతీ, ఆవుల రవి, శంకర్, శ్రీకాంత్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కార్పొరేటర్ పవన్‌కుమార్‌యాదవ్ తదితరులు

పహాడీషరీఫ్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని బడంగ్‌పేట మున్సిపాలిటీ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి రంగ నాయకుల కాలనీలో సోమవారం శంషాబాద్ జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కాలేజీ అండ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కార్పొరేటర్ సహకారంతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ విరాజ్‌కుమార్ పర్యవేక్షణలో స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, స్వచ్ఛతపై ప్రార్థన నిర్వహించి పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇటీవల విషజ్వరాల ప్రబలి ఎంతో మంది ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని దోమల విజృంభణకు తావు లేకుడా ప్రజలందరూ స్వచ్ఛతను పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కల్పవల్లి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయానికి పేరు మార్చొద్దు



కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్యులు

కలెక్టర్‌కు ఆర్యవైశ్యుల వినతి

షాద్‌నగర్‌రూరల్: పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం పేరును మార్చకుండా ఆయన పేరునే ఉంచాలని కోరుతూ సోమవారం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శశాంకకు ఆర్యవైశ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణం నుంచి ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్దఎత్తున కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ.. పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టాలని ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆనాడు తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు పొట్టిశ్రీరాములు తన ప్రాణాలను లెక్కచేయకుండా 58 రోజులు ఆమరణ నిరాహార దీక్షను చేపట్టారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి పేరును మార్చాలనే ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. తెలుగు ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన మహోన్నతులు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆర్యవైశ్యుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం పేరును యథాతథంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో నిర్మించే ప్రాజెక్టులు, కట్టడాలకు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రవికుమార్‌గుప్తా, లక్ష్మయ్యగుప్తా, వెంకటేశం గుప్తా, గందె సురేశ్, కిరణ్‌కుమార్, సరాపు రమేశ్, రామనాథం, మధు, వీరబ్రహ్మ శ్రీనివాస్, వినోద్‌కుమార్, ఎంసాని శ్రీనివాస్, తాటి విజయ కుమార్, గుడిపల్లి త్రినాథ్, గుబ్బ శ్రీనివాసులు, నాగరాజు, ఎల్కుర్తి నారాయణ, నాగరాజు, తాటి రామచంద్రుడు, ఆగీరు రవికుమార్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించుకోండి

లోక్ అదాలత్‌లో రిటైర్డు జడ్జి సాంబశివుడు



కేసులను పరిష్కరిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివుడు, ట్రాఫిక్ సీఐ వెంకటేశం

చేవెళ్ల: వాహనదారులు పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ కేసులను పరిష్కరించుకునేందుకు ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు రిటైర్డు జడ్జి సాంబశివుడు అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో సోమవారం ట్రాఫిక్ కేసులపై లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసుల పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం 23 నుంచి 28వ తేదీవరకు ఉంటుందని తెలిపారు. మొదటిరోజు నిర్వహించిన లోక్ అదాలత్‌లో మద్యం తాగి వాహనాలు నడిపించిన కేసులు 128 పరిష్కరించబడినట్లు తెలిపారు. వీటికి గాను జరిమానాగా 3లక్షల 41వేల రూపాయలు విధించామన్నారు. పెండింగ్ కేసులు ఉన్న వ్యక్తులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, కోర్టు స్టాఫ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అక్టోబరు 4 నుంచి 13 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను సోమవారం విడుదల చేశారు. వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆలయ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య, ఇతర సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు, దేవీ నవరాత్రి ఉత్సవాలకు తగిన బందోబస్తు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వైస్ చైర్మన్లు పాపారావు, సత్తయ్య, కోశాధికారి శ్రీధర్, సహాయ కోశాధికారి రామలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు, సభ్యులు సునీల్‌కుమార్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, రమేష్‌బాబు, అశోక్‌కుమార్, సలహాదారులు సూర్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, జయసూర్య పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

తలకొండపల్లి: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. సోమవారం మండల పరిధి మాదాయిపల్లిలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అఖిల్, అనిల్ నేతృత్వంలో.. హైదరాబాద్ కామినేని ఆస్పత్రి, ఆమనగల్లు లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 225 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బుచ్చిబాబు, సత్యంగౌడ్, శ్రీశైలం, మాజీ సర్పంచ్ హైమావతి, రామస్వామి, మాజీ ఉప సర్పంచ్ జయమ్మ, శ్రీనివాస్, గౌరయ్య, తిరుపతయ్య, శేఖర్, పెంటయ్య, శ్రీను, సాయిలు, అఖిల్, శ్రీశైలం, వినోద్, కుమార్, సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి కానుకగా తొలి వేతనం

మొక్కు చెల్లించుకున్న భక్తురాలు

యాచారం: చదువుల తల్లికి తన మొదటి నెల వేతనాన్ని కానుకగా సమర్పించి ఓ భక్తురాలు మొక్కులు చెల్లించుకుంది. యాచారం గ్రామానికి చెందిన తడకమళ్ల శిరీషకు గురుకుల పాఠశాలలో టీజీటీ ఉద్యోగం వచ్చింది. ఈ నేపథ్యంలో ఆమె సకుటుంబ సమేతంగా సోమవారం నందివనపర్తి గ్రామంలోని శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయానికి చేరుకుంది. పూజల అనంతరం అమ్మవారికి కానుకగా.. ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డికి రూ.53,299 వేలను చెక్కు రూపంలో అందజేసింది. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. అమ్మవారి దయతోనే ఉద్యోగం సాధించినట్లు చెప్పారు. గుడి నిర్మాణంలో భాగస్వామ్యం కావడం కోసం తన మొదటి నెల జీతాన్ని విరాళంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు రాఘవేంద్రశర్మ, కొండూరి రామనాథం పాల్గొన్నారు.

అవగాహన కలిగేట్లు.. విద్యార్థుల ఓటింగ్



ఎన్నికైన విద్యార్థి కమిటీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

మోడల్ స్కూల్‌లో విద్యార్థి కమిటీల నిర్వహణకు ఎన్నికలు

కందుకూరు: మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థి కమిటీకి ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక నైపుణ్యాల పెంపు కోసం, విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నామినేషన్ వేసిన విద్యార్థులు తోటి విద్యార్థులను ఆకర్షించేలా హామీలు, ఉపన్యాసాలు ఇవ్వడం వంటి ప్రక్రియలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన ఎన్నికల్లో 19 మంది పోటీలో నిలబడితే 571 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్కూల్ లీడర్‌గా అక్షయ దీవెన, వైస్ లీడర్‌గా అరవింద్‌రెడ్డి, స్పోర్ట్స్ కమిటీ కెప్టెన్‌గా సీహెచ్ నవీన్, వైస్ కెప్టెన్‌గా దిలీప్, కల్చరల్ కెప్టెన్‌గా ప్రణయ్, హరితహారం స్వచ్ఛభారత్ కెప్టెన్‌గా భార్గవి, డిసిప్లేన్ కెప్టెన్‌గా కీర్తన, స్టెమ్(సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మాథమేటిక్స్) కెప్టెన్ మాళవిక గెలుపొందారు. గెలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుముదిని, సునీత, గురురాజారెడ్డి, కొండల్‌రావు, శ్రీనివాసాచారి, పుష్పలత, కరుణాకర్, దామోదర్, సురేశ్, విజయలక్ష్మి, వేణుగోపాల్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: హైదరాబాద్ బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలలో నాలుగు రోజుల పాటు సీబీఎస్ఈ క్లస్టర్ 7వ ఖోఖో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. అండర్ 14, 17, 19 విభాగాలలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 200 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి దాదాపు 5500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 24 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సోమవారం నిర్వహించిన వివిధ విభాగాలలో ఠాగూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. బాలికల విభాగంలో ఠాగూర్ పాఠశాల విద్యార్థినులు తమ ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించి ముందంజలో ఉన్నారు. బాలుర విభాగంలో తమ ప్రత్యర్థి జట్టుపై ఠాగూర్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. క్రీడలలో ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్న విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి, తదితరులు

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: క్రీడల్లో గెలుపోటములు సహజమని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీఆర్ఆర్ స్టేడియంలో జోనల్‌స్థాయి అండర్ 14, 17 స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడా కారులకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నాయకులు చేవెళ్ల స్వామి, జనార్ధన్‌రెడ్డి, దండు రాహుల్‌గుప్తా, రవీందర్‌నాయక్, అన్వర్, బండ మహేందర్‌గౌడ్, రాఘవేందర్, ఉపాధ్యాయులు సుశీల, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.